# వసంతమ్మ మనమరాలు

ముత్యాలుదగ్గర వాడుకగా బుట్టెడుపూలూ మరో చిన్నబుట్టతో మరువం కొని దండలుకట్టేది వసంతమ్మ. మూరతోకొలిచి వాటిని కత్తిరించి, బుట్టలో అడుగున తడిబట్టపరచి, దానిమీద ఈ దండలు వలయాకారంలో చుట్టిపెట్టి, మరొక తడిబట్ట పైనకప్పిఉంచుకునేది. ఆమె మనమరాలు రాజిని స్కూలుకు పంపి తలుపుతాళంవేసి బుట్ట చేతపట్టుకుని బయలుదేరేది.

అక్కడికి ఒక ఫర్లాంగుదూరంలో కొత్తగా కాలనీ తయారయింది. ఇళ్ళన్నీ నిండిపోయాయి అక్కడికి అమ్మకానికి కూరగాయలు పండ్లు పూలు ఏవివచ్చినా గంపలు సులభంగా ఖాళీ అయిపోతాయి.

వసంతమ్మకు మొదటినుంచి ఏపూలతోనయినా దండలుకట్టి పగటివేళ తనయింటిదగ్గరున్న యిళ్ళకువెళ్ళి అమ్మటం అలవాటు. కొత్తగా ఈ కాలనీ వచ్చినప్పటినుంచీ ఇటువైపువెళ్ళటం ప్రారంభించింది. మంచి సువాసనగల మల్లె మొగ్గలూ మధ్యమధ్య మరువంపెట్టి ఆమె కట్టినదండలు, పిల్లలూ పెద్దలూ బుట్టలో చేతులుపెట్టి తీసుకునేవారు. అరగంటకల్లా బుట్టఖాళీఅయ్యేది. మూర ఎనిమిది అణాలతో ప్రారంభించి పన్నెండణాలు చేసింది.

ఆమె మనమరాలు రాజి పదవక్లాసు పరీక్షలు కాగానే వసంతమ్మకు ఊరికి వెళ్ళాల్సినపని ఒకటివచ్చింది. ఆమెకు ఒక్కడే అన్నగారు. అయనకు ప్రాణ మ్మీదికి వచ్చిందని ఉత్తరంరాగానే, వెళ్ళిచూడాలని ప్రాణంగుంజటం మొదలు పెట్టింది.

"రాజీ, నీ స్నేహితురాలిని ఇంట్లో నీకుతోడుగాఉంచి నేను ఊరికివెళ్ళిరానా? అక్కడ ఎక్కువరోజులుండను. మా అన్నయ్యనుచూసి రెండురోజులుండివస్తాను. ఉంటావా? నీవు వెళ్ళమంటే వెళ్తాను లేకపోతే వెళ్ళను" అన్నది వసంతమ్మ.

"ప్రసన్నను ఉంచుతానంటున్నావుగా? రెండురోజులు ఇద్దరం హాయిగా

ఉంటాము. వెళ్ళిరా అందులో ప్రసన్నకు వంటచెయ్యటంవచ్చు. నీవువెళ్ళి, రెండు రోజులుకాదు - నాలుగురోజులుండు. పక్కన లింగయ్యగారింట్లో అంతమంది ఉన్నారు. మాకేంభయంలేదు" అన్నది రాజి.

ఆమధ్యాహ్నం బయలుదేరేటప్పుడు వసంతమ్మ "అన్నీ యింట్లోఉన్నాయి. నీవు బజారుకు వెళ్ళక్కర్లేదు. పూలదండలు ప్రమేయం పెట్టుకోకు. చిన్నపిల్లవు అందరిళ్ళకూ వెళ్ళటం దండలమ్మటం బాగుండదు. వంటచేసుకుని భోజనం చెయ్యండి" అని ప్రసన్నను పిలిచి అన్నిచూపించి రైలెక్కింది.

రాజికీ ప్రసన్నకూ స్వతంత్రంగా ఇంట్లోవండుకుని తింటూ ఉండటం హాయిగాఉంది. కబుర్లూ సినెమాతారల కథలూ చెప్పుకుంటూ రెండు రోజులు గడిపారు.

"మీ అమ్మమ్మ పూలదండలు కట్టేదిగా? మనంకూడా కడదామా?" అంది ప్రసన్న.

"పువ్వులుతెచ్చే ఆమెను వద్దందిగా అమ్మమ్మ? మళ్ళీ తను వచ్చిన తరువాతనే రమ్మని చెప్పింది."

"నీకు కట్టటంరాదా? నాకు రాదా? పువ్వులు తీసుకురమ్మని చెప్తాను. వాళ్ళయిల్లు నాకుతెలుసు" అంది ప్రసన్న.

"అమ్మమ్మవచ్చి ఏమయినా అంటే?"

"ఏమనదు 'పిల్లలు బుద్ధిమంతులు' అనుకుని సంతోషిస్తుంది."

అనుకోగానే ప్రసన్నవెళ్ళి పువ్వులూ మరువం వాడుకగాతెచ్చే ఆమెయింటికి వెళ్ళి చెప్పివచ్చింది. ఒక బుట్టనిండా మల్లెపూలు ఇంకో చిన్నబుట్టనిండా మరువం తెచ్చి చాపమీదపోసింది. ఆమెను అందరూ ముత్యాలూ అని పిలుస్తారు. ఆమె వృత్తి పూలమ్మటం.

ముత్యాలు ఒక్కతే ఉంటుంది యింట్లో. పెరట్లో మల్లెపందిరి నిండా మొగ్గలుంటాయి ఎప్పుడూ. మరువం ఒకమడివేస్తుంది. గోడవారగా కనకాంబరాలూ నీలాంబరాలూ వేసింది. ఎప్పుడూ వాటికి ఎరువులువేస్తూ నీళ్ళుపోస్తూ ఉంటుంది.

ఆమెకు అదే జీవనాధారం కాక కాలక్షేపంకూడాను. అందరితో మర్యాదగా మాట్లాడుతుంది. ఎవరికేసహాయం కావాలన్నా చేస్తుంది.

ఇద్దరూకలసి దండలుకట్టారు.

"అమ్మమ్మ మూరెడుకొలిచి కత్తిరిస్తుంది" అన్నది రాజి.

"మనమూ కత్తిరిద్దాం దండ ఎంతకమ్మేది?" ప్రసన్న ప్రశ్నించింది.
"అర్ధరూపాయితో మొదలుపెట్టి పన్నెండు అణాలు చేసింది" అన్నది రాజి.

"ఇద్దరం భోజనంచేసి తలుపుతాళంవేసివెళ్దాం. రెండుగంటల లోపల వచ్చెయ్యచ్చు" ప్రసన్న బయలుదేరదీసింది రాజిని.

ఇద్దరూ చెరొక చిన్నగంప తీసుకున్నారు. వాటిమీద తడిబట్టలుకప్పి బయలుదేరారు.

వీళ్ళను చూడగానే పిల్లలూ పెద్దలూ బైటికివచ్చి "ఇలా లోపలికిరండి. వసంతమ్మ ఏమయింది? నిన్నా మొన్నా రాలేదు మీరెవరు?" అడిగారు.

"వసంతమ్మగారి మనమరాలు ఈ అమ్మాయి. మేమిద్దరం స్నేహితులం. వసంతమ్మగారు ఊరికెళ్ళారు. రేపో ఎల్లుండోవస్తారు. మీకు కావలసిన దండలు తీసుకోండి, తొందరగా" ప్రసన్న దండలు పైకితీసి చూపించింది.

ఆ యింట్లో నాలుగేకొన్నారు. వాటిని ముక్కలుచేసి అందరూ తలా ఒకటి తలలో పెట్టుకున్నారు. అలవాటుచొప్పున నాలుగు దండలకు రెండు రూపాయలు చేతిలో పెట్టారు.

"పన్నెండణాలని వసంతమ్మగారు చెప్పారు. పూలమ్మే ముత్యాలమ్మ ధర ఎక్కువచేసిందట" అన్నది ప్రసన్న.

రేపటినుంచీ చూద్దాంలెండి" అన్నారు ఆ యింట్లో.

తరువాత ఇళ్ళల్లో పన్నెండణాలకు అమ్మారు. ఇంటికివచ్చి లెక్కచూసుకుంటే ఒడినిండా చిల్లరడబ్బులు. ముత్యాలు ఎనిమిదిరూపాయలు తీసుకువెళ్ళింది. మిగిలిన డబ్బులు ఒక బట్టలో మూటకట్టి బీరువాలో పెట్టారు.

మరునాడు ముత్యాలు వచ్చినప్పుడు "నీలాంబరాలు కనకాంబరాలుకూడా

తీసుకుని నాలుగు రూపాయలెక్కువ ఇవ్వండి. మీరు కట్టేదండలు బాగున్నాయి. అందరూ కొంటారని తెచ్చిపోసింది. ఇద్దరూ ఉత్సాహంగా మల్లెపూలు మరువంతో కొన్ని దండలు, మల్లెలూ నీలాంబరాలతో కొన్ని, మరి కొన్ని కనకాంబరాలతోనూ దండలుకట్టి బయలుదేరారు. రాజికి బుట్టతీసుకుని వెంటఉండటమేగాని బేరాలు చెయ్యటం గట్టిగా మాట్లాడటం చేతకాదు. ప్రసన్నే బేరాలుచేసి అమ్ముతున్నది. ఆ రోజు యింటికి రాగానే ముత్యాలుకు పది రూపాయలిచ్చారు. మిగిలినచిల్లర దోసెళ్ళతో ఒక బట్టలోపోసి మూటకట్టి బీరువాలో పెట్టారు. ఇలా పది రోజులు గడిచిన తరువాత వసంతమ్మ దగ్గర్నుంచి ఉత్తరంవచ్చింది. తన అన్నగారికి జ్వరం తీవ్రంగాఉందనీ నాలుగురోజుల తరువాత వస్తానని రాసింది.

ప్రసన్న "రాజీ, మీ అమ్మమ్మ నాలుగురోజులుకాదు-ఇంకా వారంఉన్నా మనకేం భయంలేదు" అంది

''నీకు ఇల్లిల్లూ తిరగటం సరదాగాఉందా?" అంది రాజి.

"నీకుమాత్రం సరదాగాలేదా? ఇంకెన్నాళ్ళులే. మీ అమ్మమ్మవస్తే ఆమే చేసుకుంటుంది తన పని" అన్నది ప్రసన్న.

రాజి, ప్రసన్న ఒక స్కూల్లో చదువుకునేవాళ్ళు. ప్రసన్నకు తల్లీదండ్రీ ఇద్దరూలేరు. మేనమామదగ్గరుండి చదువుకుంటోంది. రాజి తల్లి పురుడురాగానే చనిపోయింది. తండ్రి అప్పటినుంచీ అమ్మమ్మదగ్గరే ఉంచి డబ్బుపంపిస్తూ ఉంటాడు. రాజి ఇంతవరకూ తండ్రిని చూడలేదు. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆ భార్య రాజిని సరిగా చూడదన్నభయంతో అమ్మమ్మదగ్గరే ఉంచాడు.

అలా రాజి అమ్మమ్మదగ్గరేఉండి కాలేజిలో బి.ఎస్సీ చదివింది. ఎం.ఎస్సీలో ప్రవేశించింది. చురుగ్గాచదివి మెరిట్ స్కాలర్‌షిప్పుకూడా సంపాదించింది.

ఆ సంవత్సరంలోనే మురళి అనే అతడుకూడా ఎం. ఎస్సీలో చేరాడు. ఇద్దరికీ పరిచయం ఎక్కువ లేకపోయినా పోటీలుపడుతూ చదువుతూ ఉండేవారు. ప్రసన్న రెండుసార్లుతప్పి బి.ఏ రెండవసంవత్సరంలో ఉంది.

ప్రసన్నకు ఇంట్లో పనెక్కువ. వంట చెయ్యటం పిల్లలనుచూడటం, వాళ్ళకు చదువు చెప్పటంవల్ల ఆమె చదువులో వెనకబడ్డది. మేనమామకు, ప్రసన్నకు

అప్పుడే పెళ్ళి చెయ్యాలనిలేదు. ప్రసన్న ఇంటిపనంతాచేస్తుంటే మేనమామ భార్య కూ్కుడా సుఖంగాఉంది.

ఎం.యస్సీ పరీక్షలుకాగానే మురళి అన్ని ఉద్యోగాలకూ అప్లైచేశాడు. పోటీ పరీక్షలురాశాడు. అతడు పేదకుటుంబంలోనుంచి వచ్చాడు. డబ్బు అవసర మెక్కువగాఉంది. ఏ ఉద్యోగం దొరికినా చేరేటట్టుగా ఉన్నాడు.

"రాజికి పెళ్ళి చెయ్యవలసినవాడు తండ్రి. పెద్ద లాయరు కూతురిబాధ్యత ఆయనకు తెలియదా" అనుకుంటుంది వసంతమ్మ. అవరోధాలు ఎదురుకాలేదు కనుక తను "ఇంకా పైచదువు చదువుతాను" అని రాజి అంటోందీ మధ్య అమ్మమ్మతో-ఇద్దరివీ చెరొకవిధమైన ఆలోచనలు.

"మీ నాన్నకు ఉత్తరంరాయి. ఒకవేళ పెళ్ళిసంబంధాలు చూస్తున్నాడేమో? ఆయన చదవమంటే చదువుకో" మంటుంది వసంతమ్మ.

"నేనింతవరకూ ఆయనను చూడలేదు. నాకు ఆయన ఒక ఉత్తరమైనా రాయలేదు. నేను ఏమని రాయను ?" అంది రాజి అభిమానంతో.

"మరేంచేద్దాం ? నేను వెళ్ళి అన్నిసంగతులూ చెప్పవచ్చు. కాని, ఆ యింటి పరిస్థితులెట్లా ఉన్నాయో ? అసలు తనకొక కూతురున్నదని భార్యకు చెప్పాడో లేదో? చెప్పకపోతే తగాదాలొస్తాయి" అంది వసంతమ్మ.

"అయితే నన్నిప్పుడేంచెయ్యమన్నావు ?"

"మీ నాన్న ఏమంటాడో చూద్దాం !" అంది వసంతమ్మ.

రాజికి ఎం.యస్సీలో మార్కులు బాగావచ్చాయి. ఆమెకు అమ్మమ్మ చెప్పి నట్టు ఊరికే ఉండాలని లేదు. ఎన్నడూ తనను తలవని తండ్రి కరుణాకటాక్షాలు మీద ఆధారపడటం చదువు ఆపుకోవటం ఆమెకిష్టం లేదు.

మురళి ఒకనాడు రాజికి కనబడి రీసర్చిచేయటానికి నేను విదేశాలకు దర ఖాస్తు పెడుతున్నాను. నీవుకూడా పెట్టు, వస్తే మంచిదే. రాకపోతే అన్నిటితో పాటు ఇదీ అనుకుందాం. అన్నట్టుపోటీ పరీక్షలకు దరఖాస్తులు పెట్టటానికి ఇంకా టైముంది. పెడతావా?" అని అడిగాడు.

రాజికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తను పోటీపరీక్షలు రాయాలనీ ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టాలనీ మనసారా కోరుకుంటున్నాడు మురళి. నిజానికి అతడు తనకేమవుతాడని ? అమ్మమ్మ చూస్తే ఇట్లా ? తండ్రిచూస్తే అట్లా ? ఇద్దరి మధ్యా తనెక్కడ ?

నిజంగా తన భవిష్యత్తు బాగుండాలని కోరేవాళ్ళు వీళ్ళిద్దరూ కాదు, మురళి అనిపించింది.

మరునాడు అతడిని కలుసుకుని ఎడ్రసులు కనుక్కొని అన్నిటికీ తను కూడా దరఖాస్తులు పెట్టింది.

ఇద్దరూ అప్పుడప్పుడు కలుసుకుని 'ఏమన్నా తెలిసిందా' అని ప్రశ్నించుకునేవారు

"అమ్మమ్మా ! నేను ఎక్కడైనా ఉద్యోగం చెయ్యటానికిపోతే నీవు కూడా వస్తావా !" అని అడిగినప్పుడు వసంతమ్మ ఒక్క నవ్వు విషాదకరమైన నవ్వు నవ్వేది.

"మీ తాత నన్నొదిలిపెట్టి వెళ్ళారు. ఒక్కగానొక్క కూతురని కళ్ళల్లో పెట్టుకుని పెంచితే మీ అమ్మా నన్నొదిలిపెట్టి వెళ్ళిపోయింది. ఇప్పుడు నీవు ఉద్యోగం చేయటానికి నన్నొదిలిపెట్టితే ఏమాత్రం భయపడుతుందో చూడాలని అడిగావు కదూ ? నిన్నొదిలిపెట్టను. నీవు మెచ్చిన అయ్యచేతిలో నీచెయ్యి కలిపి, చూసి, ఆనందిస్తూ నీతోనే ఉంటాను" అంది

"అమ్మమ్మా ! పెళ్ళిమాటలూ ఉద్యోగం మాటలూ కొన్నాళ్ళాపుచేద్దాం. అవి వచ్చినప్పుడు వస్తాయి. అంతవరకూ నేను దండలు కడతాను. నీవువెళ్ళి అమ్ముకురా. నీవు లేనప్పుడు మేము రంగురంగుల పూలతో దండలు కట్టాము. ప్రసన్న అమ్ముతూఉంటే నేను వెనకవెళ్లేదాన్ని. అలా కడతాను చూడు' అని పూలదండలు కట్టి ఆమెకిచ్చేది. ఆమె వాటిని బుట్టలోపెట్టుకుని అందరినీ ఆత్మీయంగా కలుసుకుని, మనసారా మాట్లాడి దండలు అమ్మి డబ్బు తెస్తూఉండేది.

"ఏమండీ మీతో వచ్చే అమ్మాయి రాలేదేం ?" అని అడిగాడు శాంతారామ్. అతడు ఒక డాక్టరుగారి కొడుకు. విదేశాలకు వెళ్ళాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. "తండ్రి పెళ్ళిచేసుకుని వెళ్ళు"అని ఉత్తరంరాస్తే వచ్చాడు. ప్రసన్న, రాజిదండలు

అమ్మటానికి వచ్చినప్పుడు రాజిని చూశాడు. అతడు చూసిన పెళ్ళికూతుళ్లందరి లోకి మెరుపుతీగె అనిపించింది రాజి.

''నాతో రాదుగానీ, నేను ఊళ్లోలేనప్పుడు స్నేహితురాలితో వచ్చేదిట. ఇప్పుడు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. దరఖాస్తులు పెడుతోంది. మంచిమార్కులతోయం. యస్సీ ప్యాసయింది నాయనా !" అన్నది.

"ఎక్కడెక్కడ దరఖాస్తులు పెట్టిందో నేను అడిగి, అవసరమయిన సహాయంచేస్తాను. రేపు పిలుచుకురండి" అన్నాడు.

వసంతమ్మ చెప్పగానే "నాకు తెలిసినచోట్ల దరఖాస్తులు పెట్టాను. ఆయన చెప్పేదేమిటి ? ఆమాత్రం నాకూ తెలుసు" అన్నది రాజి. వసంతమ్మ ఆ మాట అనగానే రాజికి రోషం ముంచుకువచ్చింది. ప్రసన్నతో పూలదండలు అమ్మటానికి వెళ్ళినప్పుడు ఒక యింట్లో బుట్టలోఉన్న రెండుదండలు లాక్కుని రెండిటికి ముడి పెట్టి, రాజి వెనకనుంచి వచ్చి, పూలదండ మెడలోవేశాడు. రాజి ఉలిక్కిపడి చూసేసరికి లోపలగదిలో నిలబడి నవ్వుతున్నాడు.

రాజి రెండుకళ్ళూ బాగా విప్పుకుని అతడిని చూసింది ఎర్రగా.

అతడు మామూలు చామనచాయలో చారెడేసి కళ్ళతో చూస్తున్నాడు. రాజి జడ వెనక్కువేసుకుని విసురుగా వెళ్ళబోతే, అతడు పట్టుకులాగిన జడలోనుంచి రిబ్బను అతడి చేతిలోకి వచ్చింది. తను ప్రసన్నతో గబగబానడిచి వెళ్ళిపోయింది. తరువాత మళ్ళీ అటువైపుకు వెళ్ళలేదు.

"ఏమిటా స్వతంత్రమతడికి ? ఎవరిచ్చారు ?"

''అమ్మమ్మ చెప్పిన అబ్బాయి అతడే అయిఉంటాడు" అనుకుంది రాజి.

"అదేమిట్రా అట్లా చేశావు ఆపిల్లను ? వాళ్ళ అమ్మమ్మ చూసిందంటే మండి పడుతుంది" అన్నది తల్లి కొడుకును మందలిస్తూ.

"అమ్మా, నీవు చూపించిన పెళ్ళికూతుళ్ళందరిలోకి ఆ అమ్మాయి నాకు నచ్చింది. తెలివిగలది, బాగా చదువుకుంది, అమ్మాయి అందంగా ఉంది. ఇంకేం కావాలి ?" అన్నాడు మాట మారుస్తూ.

‘‘చదువూ, తెలివీ, అందం నీకు నచ్చితే సరేనా ? నీవి అమ్మాయికికూడా నచ్చాలిగా ? అయినా, ఆ అమ్మాయి తల్లిదండ్రులెవరో తెలుసుకోవద్దూ ? అమ్మమ్మకు ఇల్లుంది, కొన్ని నగలు ఉన్నాయి. డబ్బుకూడా ఉందని అందరూ అంటారు. కాని, ఆమె అట్లా పూలదండలు కట్టి అమ్ముతుంది.”

“అమ్మా, వాళ్ళ అమ్మమ్మ ఏంచేస్తే మనకెందుకు ? అమ్మాయిని కదా మనం చూసేది ?”

“నీ మాట నిజమేననుకుందాం. అమ్మాయి తల్లిదండ్రులను మనమడగట మేమిటి ? వాళ్ళు వచ్చి అడగాలిగాని !”

“అసలు అమ్మాయి నీకు నచ్చిందా చెప్పు ? నీ సంగతి చెప్పితే మిగతా సంగతులు నేను చెబుతాను” అన్నాడు.

“నాకు బాగానే ఉందనిపించింది. నాన్నకూడా అమ్మాయిని చూశారు కాని పెళ్ళిదృష్టితో మేము చూడలేదు. మర్యాదా మంచీ బాగున్నాయి. వాళ్ల అమ్మమ్మ కూడా చాలామంచిదనే అందరూ చెప్పుకుంటారు. అయితే మన స్థాయికి సరిపడ్డ సంబంధం అవునా కాదా అన్న అంశమొకటి.......”

“అమ్మా ! స్థాయి అంటే ఏమిటి ? నీకేస్థాయిలో ఉండాలనిఉంది చెప్పు ? నేను యం.టెక్ చేసిన ఊళ్లో అమ్మాయి తండ్రి పెద్దలాయరు. ఆయన పెద్ద కూతురు ఈ అమ్మాయి. తల్లిలేదు. సవతితల్లి దగ్గర ఉంచటం ఇష్టంలేక అమ్మమ్మ దగ్గరే ఉంచాడు. ఆ సవతితల్లికి ఈ అమ్మాయిసంగతి తెలియదు. తెలిస్తే బాధలు పెట్టగల మనిషే. అందుకనే ఆయన తను కూడా ఆ అమ్మాయిని సరిగ్గా చూడ లేదంటాడు. ఒక్కసారి చూశానని చెప్పాడు. అమ్మాయి ఇప్పుడు ఏంచదువు తున్నదో ఆయనకు తెలియదు. ఆ అమ్మాయంటే తనకు ప్రాణం అంటాడు. కొన్ని కారణాలవల్ల చూడలేక పోతున్నానంటాడు. భార్యకు తెలియకుండా అమ్మాయికోసం అమ్మమ్మకు డబ్బు పంపుతాడు. ఈ సంగతి అమ్మాయికి కూడా తెలియదట. ఆయన మా ప్రిన్సిపల్‌కి బాగా తెలిసినవాడు. మా ప్రిన్సిపల్ తన మిత్రుడికి నాపేరు చెప్పాడట. ఆయన నన్ను పిలిపించి చూపించాడు. నన్ను ఆయన ‘‘మీనాన్న పేరేమిటి ? ఎక్కడుంటారని” అడిగాడు. నేను నాన్న పేరు చెప్పగానే ఆయన “మేమిద్దరం ఒక కాలేజిలో చదువుకున్నాం. మీ నాన్నగారికి నేను ఉత్తరం రాయటానికి నాకు కొన్ని ఇబ్బందులున్నాయి. ఆ అమ్మాయి

సుఖమే నాకు కావలసింది. నా విజిటింగ్‌కార్డు మీ నాన్నకు చూపించు. మీ అందరికీ నచ్చితే తిరుపతిలోగాని మీ కిష్టమైచోటగాని పెళ్ళిచెయ్యమని మీ నాన్నతో చెప్పు. నీవు ఏసంగతీ మీ ప్రిన్సిపల్‌కి ఉత్తరం రాయి. పెళ్ళికి ఎంతడబ్బు కావాలో మీనాన్ననడిగి ప్రిన్సిపల్ ఉత్తరంలో రాయి. నేను చెక్కు ప్రిన్సిపల్ కిస్తాను. ఆయన పంపుతాడు" అని చెప్పారు. కావాలంటే ఈ కార్డు నాన్నకు చూపించు" అన్నాడు శాంతారామ్.

"ఓ! చాలా ఉందే?" అంటూ భర్తకు ఆ కార్డు చూపించి "మీకు ఈయన తెలుసా ?" ప్రశ్నించింది తల్లి.

"తెలుసు. వీడు నా కాలేజిమేటు. అయితే ఏం ?"

ఆమె భర్తతో కొడుకు చెప్పిన మాటలన్నీ చెప్పి, "వాడు విదేశాలకు వెళ్తానంటున్నాడు. పెళ్ళిచేసి పంపితే మంచిదని మనమనుకున్నాం కదా ? మీరు ఏమంటారో తనకు చెప్పమన్నాడు మన శాంతారామ్."

"మన అబ్బాయిగారి రాయబారం ఏమిటి మధ్యలో ? ఆయన నాకు బాగా తెలుసు. నేను వెళ్ళి చూసి అన్ని విషయాలు చెప్తాను. ఇందులో తప్పేముంది?" అన్నాడు తండ్రి.

"తప్పుకాదు కాని. ప్రిన్సిపల్ గారింటికి వెళ్ళి ఆయనను పిలిపించి మాట్లాడమని అబ్బాయి అంటున్నాడు."

శాంతారామ్ తండ్రి శేషాచలం ప్రిన్సిపల్‌ని కలుసుకుని రాజి తండ్రిని పిలిపించాడు.

రాజి తండ్రి ఆ ఊళ్లో లీడింగ్ లాయరు. ఎంతకాలానికో కలుసుకున్న స్నేహితులు ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. చివరకు పెళ్ళిమాట ఎత్తగానే కన్నీళ్లొచ్చాయి రాజితండ్రికి.

తన కూతురి చదువును గురించీ, ఆమె అందచందాలను గురించీ స్నేహితుడి ద్వారా వినవలసివచ్చినందుకు ఆయనకు కడుపులో చేయిపెట్టి కలచినట్టయింది.

"నేను వీలుచేసుకుని పెళ్ళికి పరాయివాడిగా రావటానికి ప్రయత్నిస్తాను.

నా చేతులమీదుగా ఈ పెళ్ళిని చేయలేకపోతున్నాను. నన్ను నా పరిస్థితులనూ అర్థంచేసుకో. ఇదిగో ఈ ఏబయివేల రూపాయల చెక్కు తీసుకువెళ్ళు. అన్నట్టు అమ్మాయికి కూడా ఇష్టమవునో కాదో కనుక్కోండి. అంత చదివిందంటున్నావు" అన్నాడు.

"అదొక్కటే అడగలేదురా. పిల్లవాడికి ఇష్టమేట. అమ్మాయిని చూశాడట."

"అమ్మాయినికూడా అడిగి ఏ సంగతీ మనప్రిన్సిపల్‌గారికి వైరు ఇవ్వు"

"ఇదీ జరిగినసంగతి సరే. అమ్మాయి అంతా తండ్రిపోలికలో ఉంటుంది." అన్నాడు.

"ఇప్పుడు మనం చేయవలసిన పనేమిటి ?" అడిగాడు శేషాచలం.

"ఆలోచించు" అన్నాడు తండ్రి.

సరిగా ఆరోజు సాయంత్రం మురళివచ్చి "నాకు ఇండియన్ బ్యాంకిలో సెలెక్షను వచ్చింది. ప్రస్తుతం దానిలో చేరిపోతాను. ప్రసన్న ఆయింట్లో కష్టాలు పడలేకుండా ఉన్నానని చెప్పింది. ఆమెమీద నాకు మంచిఅభిప్రాయమే ఉందిగాని నాకు ఉద్యోగం ముఖ్యం. ముందు దానిలో చేరిపోవాలని ఉంది. మీ అమ్మమ్మ గారు కూడా ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోమంటున్నారు. ముందుగా-డబ్బు సహాయం నేను చేస్తాను. గుడిలోగాని రిజిస్ట్రార్ ఆఫీసులో గాని పెళ్ళిచేసుకుని తీసుకుపో. ప్రసన్న పడేబాధలు చూడలేకపోతున్నా"నంటోంది. ఏంచెయ్యను ? నాకు సలహా చెప్పు ?" అన్నాడు రాజితో.

"ప్రసన్న కష్టపడుతున్నమాట నిజమే. మేనమామ తనంతట తాను పెళ్ళి చెయ్యడు. మా అమ్మమ్మ చేస్తుంటే వాళ్లూరుకుంటారా ? నిజంగా ప్రసన్నకూ నీకూ పెళ్ళి జరిగితే సంతోషించే వాళ్ళల్లో నేను ప్రథమురాలిని. ఏంచేద్దాం ?" రాజికి ఏంచెప్పటానికి తోచడంలేదు.

ఆ మరునాడు ప్రసన్న దురదృష్టంవల్ల శేరు పాలగిన్నె చెయ్యిజారి పోయింది. వేడివేడిపాలు కాళ్ళమీదపడి కేకలు పెట్టింది భరించలేక.

మేనత్తకు కిందపోయిన పాలను గురించిన బాధ తప్ప ప్రసన్నకాళ్ళను చూసి బాధగాని జాలిగాని కలగలేదు.

"అన్నీ యిట్లాంటి పాడుపనులు చేస్తావు. నిన్న పిల్లనుపడేశావు. ఇవాళ ఈ వంకపెట్టి బట్టలుతకవు" అని చెయ్యి చేసుకుంది. మేనమామ ఇంట్లోఉన్నా ఏంచెయ్యలేడు. గంట క్రిందట పనిమీద బైటికి వెళ్ళాడు.

ప్రసన్న ఒకటే ఏడుపు.

గోడమీదినుంచి చూసిన వసంతమ్మ "అమ్మాయి కాళ్ళుచూడు ఎట్లా కమిలి పోయాయో ? పైగా దెబ్బలుకూడా కొట్టావు. పిల్లల తల్లివి. ఆమాత్రం జాలి ఉండద్దూ ?" అంటూ ప్రసన్నను హాస్పిటల్‌కి తీసుకువెళ్ళింది. అక్కడ వైద్యం చేయించి తనయింటికి తీసుకుపోయి అన్నంపెట్టి పడుకోబెట్టింది.

రెండు రోజులు గడిచినా మేనమామగాని ఆయన భార్యగాని వచ్చిపిల్లను చూడలేదు.

"మనపీడ విరగడయింద"ని అనుకున్నట్టుగా ఉన్నారు.

వసంతమ్మ ఇంక మురళిని పిలిపించి "నాయనా ! ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకో. నేను నా చేతనయిన డబ్బిస్తాను. ఎందుకయినా మంచిది రిజిస్ట్రార్ ఆఫీసులో ముందుగా చెప్పిఉంచి, వేళకు పెళ్ళిచేసుకుని తీసుకెళ్ళు. నేనువస్తే మేన మామావాళ్ళు నా మీద కక్ష పెంచుకుంటారు. అమ్మాయికి మైనారిటీవెళ్ళింది. అమ్మాయిని జాగ్రత్తగా చూసుకో"మని చెప్పి ఐదువందలిచ్చింది.

"నేను మొదటి జీతంలో మీ అప్పుతీరుస్తానండీ" అంటూ ఆమెకు నమస్కరించాడు మురళి.

"పెళ్ళి చేసుకుని క్షేమంగా ఉద్యోగంలోచేరి ఉత్తరం రాయి నాయనా. ఏంచేస్తాం ? పెద్దలు చేయవలసిన పెళ్ళి " అని వాళ్ళను పంపించేసింది వసంతమ్మ "అమ్మయ్య, ఒకపని అయింద"నుకుంటూ.

అటు ప్రసన్నవెళ్ళింది. ఇటు రాజికి ఉత్తర అమెరికాలో రీసర్చికి సెలక్షను వచ్చింది. వసంతమ్మకు సందిగ్ధ పరిస్థితి. రాజికి సెలక్షను వచ్చిన తరువాత ఆమె ప్రయాణానికి ప్రయత్నాలు చేయటం మొదలుపెట్టింది. సర్టిఫికెట్లు సేకరించు

కుంది. బట్టలు కుట్టించుకుంటోంది. కాలేజి ప్రిన్సిపల్ కి చెప్పింది. ఆయన ఎన్నో సలహాలిచ్చారు.

ఈ సంగతి మెల్లగా శేషాచలం గారింటికి చేరింది.

"ఏంచేద్దాం ? అమ్మాయి వెళ్ళిపోతుందేమోనంటున్నాడు అబ్బాయి" అన్నది శాంతారామ్ తల్లి.

శాంతారామ్ ఆలోచనలో పడ్డాడు.

"రాజికి ఉత్తర అమెరికాలో రీసర్చికి సెలక్షను వచ్చింద"న్న వార్త శేషాచలంగారు ప్రిన్సిపల్ కి టెలిగ్రామ్ యివ్వటం ఆయన లాయరుగారికి తెలపటం క్షణాలమీద జరిగింది. లాయరుగారికి తొందరపుట్టింది. మంచి సంబంధం చేయి జారిపోతున్నదన్న విచారంతో సుప్రీంకోర్టులో కేసుందని ఇంట్లో చెప్పి, డబ్బుచేత బట్టుకుని వసంతమ్మ యింట్లో దిగారు.

ఆయనను చూసి వసంతమ్మ దిగ్భ్రాంతురాలయింది. నోటివెంట మాట రావటంలేదు. తను చూస్తున్నది నిజమా అబద్ధమా అని తబ్బిబ్బయిపోతున్నది.

"ఏమండీ. నన్ను మర్చిపోయారా ? నేను రాజి తండ్రిని. రాజినిచూసి పెళ్ళిచెయ్యాలని వచ్చాను. మంచి సంబంధమొకటి వచ్చింది. ఈ ఊరే. రాజి ఇంట్లో ఉందా ?" అడిగాడు.

రాజి ఊరికివెళ్ళే ప్రయత్నంలో పెట్టె కొనటానికి వెళ్ళి అప్పుడే బండి దిగింది. హాల్లో కుర్చీమీద కూర్చున్న ఆయనను చూసి తెల్లబోయింది ఎవరో తెలియక.

అంతలో వసంతమ్మ వచ్చి "రాజీ మీ నాన్నగారు వచ్చారు." అంది ఆయనకు కాఫీ అందిస్తూ.

రాజి చూస్తూ నిలబడిపోయింది. తనకు ఇరవై ఏళ్ళే దాటాయి. తండ్రిని ఇంతవరకూ చూడలేదు. అది సంభ్రమమో లేక విరక్తో తెలియని స్థితిలో ఉంది.

ఆయన కాఫీగ్లాసు అక్కడపెట్టి "అమ్మా, నీకు తండ్రినని చెప్పుకోటానికే నాకు సిగ్గుగా ఉంది. జరిగిందేమో జరిగింది. నీవు నార్తు అమెరికా వెళ్తావని తెలిసి చూడాలని వచ్చానమ్మా. నా దురదృష్టం మనిద్దరినీ కలుసుకోనివ్వలేదు.

నా స్నేహితుడి కొడుకు ఇక్కడే ఉన్నాడు. అతడూ విదేశాలకు వెళ్ళి ఎం.టెక్ చేశాడు. పి.ఎచ్.డీ చెయ్యాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. నీకు తగిన వాడేనమ్మా. ఏమంటావు? నీవు చూస్తానంటే అబ్బాయిని పిలుచుకువస్తాను. ఇద్దరికీ జోడు కుదిరింది బాగా." అన్నాడు.

"అవునండీ. ఆ అబ్బాయిని నేనూ చూశాను. బాగా ఉంటాడు. అనుకోకుండా వచ్చారు. పెళ్ళిచేసివెళ్ళండి." అన్నది వసంతమ్మ.

"నాకు కోర్సులో చేరటానికి వాళ్ళు టైమిచ్చారు. అతడికి ఇంకా కాగితాలు రాలేదు. నేను ఆగటానికి వీలుకాదు అమ్మమ్మా" అన్నది-రాజి తండ్రితో అనకుండా.

"ఈ సమస్య అందరం కలుసుకుని చర్చించవలసిన విషయం." అన్నాడు రాజితండ్రి.

అందరూ సమావేశమై పెళ్ళి విషయం చర్చించారు.

"నేను పి.ఎచ్.డి చేయాలని దరఖాస్తు పెట్టిన ప్రదేశం వేరు. ఆ అమ్మాయి వెళ్లేది ఉత్తర అమెరికా. ఈ చదువు అవటానికి మూడేళ్ళు పడుతుంది." అన్నాడు శాంతారామ్.

"అంతా సెటలయింది నా విషయంలో. ఇప్పుడు కాకపోతే ఎప్పుడుచేస్తాను తీసర్చి? ఇప్పుడయితే నన్ను వెళ్ళనివ్వండి" అంటోంది రాజి.

"ఇంట్లో అబద్ధాలు చెప్పి ఇంతదూరం వచ్చాను"ఏదో విధంగా పెళ్ళి చేసెయ్యాలన్న లాయరుగారి ప్రయత్నం సాగేటట్టు కనబడటం లేదు.

"అసలు-ఆ అబ్బాయిని చేసుకోవటం నీకిష్టమేనా రాజీ!" అడిగాడు తండ్రి.

అబ్బాయితల్లి వసంతమ్మనుపిలిచి "ఎంతవరకు వచ్చింది పెళ్ళివిషయం? అమ్మాయి కిష్టమో కాదో కనుక్కోండి?" అన్నది.

అందరికీ రాజిని అడగటానికి సందేహంగా ఉంది. ఎవరికివారే వెనకడుగు వేస్తున్నారు.

వసంతమ్మ పనిమీద ఎటోవెళ్ళింది. లాయరుగారు తన బాల్య స్నేహితు

డింట్లో భోజనంచేశారు. మిత్రులిద్దరూ ఈ కాలంపిల్లల పోకడలను గురించి చర్చించుకుంటున్నారు.

శాంతారామ్ రాజి యింటికి వచ్చాడు. తలుపులు దగ్గరగా వేసిఉన్నాయి. అతడు తలుపులు తెరుచుకుని హాల్లో కుర్చీలో కూర్చున్నాడు.

కూనిరాగాలు తీస్తూ గదిలో బట్టలు పెట్టెలోకి ఎక్కిస్తోంది రాజి.

రాజి బయటికి వస్తుందని ఓపికతో కూర్చున్నాడు శాంతారామ్.

కొంత సేపటికి రాజి బైటకివచ్చి శాంతారామ్‌ని చూసి ఆశ్చర్యపడి "చాలా సేపయిందా వచ్చి ? నేను లోపల సర్దుకుంటున్నాను. ఆ పని తెమలటంలేదు" అన్నది-తానొక కుర్చీలో కూర్చుని.

"మీరు డ్రింక్ తీసుకుంటారా ? కాఫీ టీ కావాలా ?"

"కాఫీ వద్దు-డ్రింకూవద్దు. మీ నాన్నగారు వచ్చారట. ఎందుకు ? ఇది వరకూ ఎప్పుడూ రాలేదట ?" అన్నాడు.

"అవును వచ్చారు. నేను వెళ్తానని ఆయనకెవరు చెప్పారో ? ఊరికి వెళ్తున్నాను కనుక చూడాలని వచ్చారట."

"ఆఁహాఁ. ఇంకేం చెప్పలేదా ?"

"నేను ప్రయాణానికి సిద్ధంచేసుకోవటంలో మునిగిపోయాను. అయినా నాకు నాన్నా అంటూ ఆయనను పిలవాలని కూడా అనిపించలేదు"

"ఆయన మనకిద్దరికీ పెళ్ళిచేయాలని వచ్చారు. ఆ విషయంలో నీసమ్మతి కనుక్కోవాలనుకుంటున్నారందరూ. బహుశ నీ దగ్గరికి వస్తారనుకుంటా ఇవాళ"

"ఎందుకు ? నాకు పెళ్ళిమీద నమ్మకంపోయింది. భార్య ఏమంటుందోనని భయపడి కన్నకూతురిని చూడలేని పెద్దమనిషికి ఈ పెళ్ళి ఆరాటమేమిటి ? మనిద్దరికీ పెళ్ళా ? అసంభవం" అన్నది.

"నాకు చాలా ఆశలున్నాయి నిన్ను గురించి. నేనిదివరకే నిన్ను పెళ్ళి చేసుకున్నాను. నా మనసంతా నీవే నిండిఉన్నావు. నీవు కాదంటే నేను పిచ్చాసుపత్రికి వెళ్ళాల్సి వస్తుంది."

"అవన్నీ వట్టిమాటలు గాని-నిజంగా మీ మనసునిండా నేనే ఉంటే మీరు ఇక చదవలేరు. ఈ భావం మీకూ ఏప్పటికీ ఉంటుందనీ ఎటువంటి పరిస్థితుల లోను మీరు కన్నవారిని ఆదరిస్తారనీ నాకు నమ్మకం కలిగితే తప్పకుండా చేసు కుంటాను. నేను అనుభవించినటువంటి బాధ నా బిడ్డలు కూడా అనుభవించరని నాకు నమ్మకం కలగాలి. అప్పుడు చేసుకుంటాను. ఎప్పుడో తాత్కాలికోద్రేకం వల్ల నేను దండవేశాను కనుక పెళ్ళిచేసుకోమ"ని అనటం నాకు నచ్చటంలేదు. మీకు చేసుకోవాలని ఉంటే మన చదువులయ్యేవరకూ ఆగండి. అప్పటివరకూ మీ మనసు మారలేదని నాకు నమ్మకం కలిగితే పెళ్ళి జరుగుతుంది. అంతేగాని-ఇన్నాళ్ళులేనిది ఇప్పుడు డబ్బుచేతబట్టుకుని నలుగురూ ఏమంటారోనని పిరికి తనంతో తన బాధ్యతను నిర్వర్తించాలని వచ్చిన పెద్దమనిషిని నేను నమ్మలేను. నన్ను వెళ్ళి నిశ్చితంగా చదువుకోనియ్యండి. మీరూ నిశ్చింతగా చదువుకుని నార్తు అమెరికారండి. అప్పటికి నా చదువూ అవుతుంది. ఈ లోపల నేనుకూడా మనసు మార్చుకోవటానికి ప్రయత్నిస్తాను"

"అప్పటికి రాజెవరో రెడ్డిఎవరో? ఇప్పటినుంచీ గాలిలో మేడలు కట్టట మెందుకు?'' అని లేచాడు విసురుగా.

అతడు వెళ్తుంటే చూసింది రాజి.

రాజి బయలుదేరుతుంటే డాక్టరుగారింట్లో అందరూ కిటికీలోనుంచి చూశారు. తండ్రి డాక్టరుగారింటి వరెండాలో నుంచి చూశాడు.

వసంతమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ మనమరాలైన రాజిని రైలువరకూ సాగనంపింది.

"అమ్మమ్మా. నేను వారానికో ఉత్తరం రాస్తాను. నీవు వెంటనే నీ సంగతి నాకు రాయి. ఇటు చూస్తూఉండగానే మూడేళ్లు గడిచిపోతాయి. అమ్మమ్మా రైలు కదులుతోంది జాగ్రత్తగా దిగు. నన్ను మర్చిపోకు." అంటూ చెయ్యి ఊపింది రాజి.

❀❀